'ఆంధ్రప్రదేశ్' సౌజన్యంతో 'రంజని' నిర్వహించిన రాయప్రోలు రామకృష్ణయ్య
స్మారక కథల పోటీ - 2010లో ప్రథమ బహుమతి పొందిన కథ

# ఆశ్రయం



సింహప్రసాద్

**కి**ట్టూ అలికిడి విన్పించలేదు.

వంట చేస్తున్న దానినల్లా చేతిలోని పని వదిలేసి గబాగబా హాల్లోకి వెళ్ళాను. లేదు. గదిలోకి చూశాను. అక్కడా లేదు.

'ఇప్పటి దాకా బొమ్మల్తో ఆడుకుంటూనే వున్నాడు. ఇంతలో ఎటువెళ్ళాడబ్బా?'

ఇంట్లోంచి బయటి కెళ్ళే అవకాశం లేదని తెలిసినా ఆదుర్దాగా వెదికాను.

బాల్కనీలో కన్పించిన దృశ్యం చూసి అప్రయత్నంగా నా కాళ్ళు ఆగిపోయాయి.

రెండేళ్ళు నిండని కిట్టూ చిన్నగా నవ్వుతూ ఏదేదో మాట్లాడేస్తున్నాడు. వాడి భాష అర్థమైనట్టు ఇట్నించటు, అట్నించిటు వయ్యారంగా తిరిగుతోంది ఊర పిచ్చుక.

పిచ్చుక కాదు పిచ్చుక పిల్లే. ఇప్పుడిప్పుడే రెక్కలార్చుకుంటున్నట్టు వుంది. బూడిదరంగుతో ముచ్చటగా వుంది. మురిపెంగా ఎగుర్తోంది.

చప్పుడు చెయ్యకుండా వారి మూగ విన్యాసాలు చూస్తుండి పోయాను. పిచ్చుక ఆహారం కోసం తడుముళ్ళాడు తోందన్పించింది.

లోపలికెళ్ళి గుప్పెడు బియ్యపు గింజలు తెచ్చి వేశాను.

బెదరి పైకెగిరి మళ్ళీ వాలి బెదురు చూపులు చూస్తూనే ఒక్కొక్క గింజా తినసాగింది.

కిట్టూ నా వంక అభినందన పూర్వకంగా చూశాడు. ఆనందోత్సాహంతో చేతులూపాడు. ఏదేదో చెప్పెయ్య సాగాడు.

వాడ్నెత్తుకుని ముద్దులు కురిపించాను. వాడ్ని లోపలికి తీసుకెళ్ళాలని చూశాను గాని రానని మారాం చేశాడు. వాడితో బాటు నేనూ ఆగిపోయాను.

కడుపు నిండేక ఆనందంతో కాబోలు రెండు సార్లు అటూ ఇటూ తిరిగి రివ్వున ఎగిరెళ్ళిపోయింది.

మా ఇంటి ప్రక్కనే గల తుమ్మ చెట్టుకు వేలాడుతోన్న పిచ్చుకగూడులో కెళ్ళిపోయింది. కిట్టూ అబ్బురంగా చూశాడు. చూపించాడు.

"పిచ్చుక" చెప్పేను.

"కిచ…"

"కిచకిచ పిచ్చుక…"

"కిచ… కిచ…"

"కిచకిచ…"

"కిచ…కిచ…"

కాస్సేపు మాకదో ఆట అయిపోయింది. వాడి సంబరం చూసి పొంగిపోయాను.

మా ఎపార్ట్‌మెంట్ ప్రక్కనే గల సుమారు ఎకరం స్థలం రకరకాల చెట్లతో మహావృక్షాలతో నిండి చిన్నసైజు అడవిలా వుంటుంది. ఎన్నెన్నో రకాల పక్షులు అక్కడ నివశిస్తున్నాయి. రాత్రివేళ భయమన్పించినా, పగలెంతో హాయిగా వుంటుంది. పచ్చదనం కనువిందు చేస్తుంది. చక్కని గాలి ఫ్యాను అవసరం రానివ్వదు.

దాని యజమాని అమెరికాలో వుంటాట్ట. అంచేతే కాబోలు రియల్ ఎస్టేట్ వారి దృష్టి దాని  మీద పడలేదు.

మేమీ ఇంట్లోకొచ్చిన కొత్తలో సాయంత్రం వేళ పక్షుల గోల భరించలేక విసుక్కునే దాన్ని. చికాకు పడేదాన్ని. మరో ఇంటికి మారిపోదామని పోరాను కూడా.

కాని భాస్కర్ ఒప్పుకోలేదు.

"పగలంతా ఆహారం కోసం తిరిగి తిరిగి వస్తాయి. క్షేమంగా తిరిగొచ్చినందుకు ఆనందంతో పలకరించుకుంటాయి. సంబరంతో గెంతుతాయి. ఆ ధ్వనుల్లోని స్వారస్యాన్ని సంగీతాన్ని ఆస్వాదించాలి కాని కాకి గోల అని ఈసడిస్తే ఎలా చెప్పు?"

"మీకో నమస్కారం. వూరికే తేనెతుట్టని కదిపాను" నవ్వాను.

నెలల వయస్సులో వుండగానే ఎప్పుడైనా కిట్టూ సాయంత్రం వేళ ఏడిస్తే అలా బాల్కనీలోకి తీసుకెళ్ళేదాన్ని. ఠక్కున ఏడుపుమాని విప్పారిత నేత్రాలతో పచ్చని చెట్ల వంక, రంగుల పూల వంక చూసేవాడు.

తర్వాత్తర్వాత 'బూచోడు' అంటూ దెయ్యాల్లా జుట్టు విరబోసుకున్న చెట్ల వంక చూపుతూ భయపెట్టాలని చూసేను కూడా. వాడేమో అదేదో జోక్ అయినట్టు నా ముఖంలోకి చూసి మరీ నవ్వేవాడు!

మా వారు ఆఫీసు నుంచి రాగానే పిచ్చుక వృత్తాంతం వివరించాను.

ఆయన కూడా బాల్కనీలో కెళ్ళి పిచ్చుక గూడు చూశారు.

"నా చిన్నప్పుడు మా ఊళ్ళో చెట్లకి ఎన్నెన్ని పిచ్చుక గూళ్ళుండేవో చెప్పలేను. ఎటు చూసినా పిచ్చుకల కిచకిచలే విన్పించేవి. పిచ్చుక గూడు అల్లిక ఓ ఇంజినీరింగ్ ఫీట్ అనుకో. గుడ్డు లేక పిల్ల జారి పడిపోకుండాలోపల చక్కని ఏర్పాటుంటుంది...." బాల్యాన్ని నెమరువేసుకుంటూ అన్నారు భాస్కర్.

"పల్లెల్లో వడ్లు పండుతాయి గనుక ఆహారానికి కొరత వుండేది కాదు. పట్నాల్లో ఎలా బతుకుతాయి?"

“పిచ్చుకలు అడవుల్లో, ఎడారుల్లో, మనుషులుండని ప్రదేశాల్లో వుండవు తెలుసా? మనుషుల్తో బాటే వుంటాయి. మనుషులుండే చోటే మసుల్తాయి. కాని పాపం ఈ కాంక్రీట్ జంగిల్లో ఇమడ లేకపోతున్నాయి. కాలుష్యం, పురుగు మందులు, మైక్రోవేవ్ టవర్లూ వాటిని బతకనివ్వటం లేదు. దూరంగా తరిమేస్తున్నాయి”

“ధాన్యాలధరలు ఆకాశంలో ఉంటున్నాయి. మనుషులకే తిండిగింజల్లేవు. ఇక వాటికేం దొరుకుతాయీ!”

ఆ రాత్రి మా చిన్నారి కిట్టూకి స్వప్నంలో ఎన్ని హరివిల్లులు కన్పించాయో మరెన్ని కోయిల కలకూజితాలు విన్పించాయో ఏమో గాని నిద్రలో నవ్వుకున్నాడు. తనలో తను మురిసిపోయాడు.

మర్నాడు లేస్తూనే బాల్కనీలో కెళ్ళిపోయి పిచ్చుక గూడు వంక తదేకంగా చూడసాగాడు.

“వాడి ఫ్రెండ్ కోసం ఎలా చూస్తున్నాడో చూడండి...”

“పిల్లలకి ప్రకృతిలోని ప్రతీదీ వింతగా వుంటుంది. ఆకర్షిస్తుంది. ప్రకృతిని మించిన బడి లేదంటారందుకే”

“మీకు చెప్పేనా. రోజూ తులసి కోటకి నీళ్ళు పోసి దణ్ణం పెట్టుకుంటాను కదా. వాడూ గ్లాసుతో నీళ్ళు తెచ్చి పోస్తున్నాడండీ...”

భాస్కర్ సాలోచనగా చూసి తలపంకించారు.

నిన్న వచ్చిన సమయానికే పిచ్చుక మళ్ళీ వచ్చింది. సందేహం లేదు. నిన్నటి పిచ్చుకే.

దాన్ని చూసి కేరింతలు కొట్టాడు. నన్ను బియ్యపెట్టి దగ్గరికి లాక్కెళ్ళి బియ్యపుగింజలు తన చిట్టి చేతుల్తో పట్టుకొచ్చి మరీ వేశాడు.

పిచ్చుక తింటోంటే పరవశించి పోయాడు.

సాయంత్రం భాస్కర్ ఆఫీసునుంచొస్తూ నాలుగు పూల కుండీలూ గులాబీ అంట్లూ తెచ్చాడు. వాటిని బాల్కనీలో అమర్చి నీళ్ళు పోశాం.

కిట్టూ ఆసక్తిగా చూశాడు. అల్లరి చెయ్యకుండా బుద్ధిగా ఇంతింత కళ్ళతో గమనిస్తూండిపోయాడు.

పిచ్చుక రోజూ వస్తోంది. తనంతట తనే బియ్యపు గింజలు వేస్తున్నాడు. ‘కిచ కిచ’ అంటూ తప్పట్లు కొడుతున్నాడు.

గులాబీ మొక్క మొగ్గ తొడిగింది. విస్ఫారిత నేత్రాలతో వింతగా చూశాడు కిట్టూ.

మొగ్గ పూవుగా వికసించింది. పరమానంద పడిపోయాడు. అదో అత్యద్భుతంగా వుంది వాడికి. నాకూ, మా వారికీ మళ్ళీ మళ్ళీ చూపించాడు. ఇంటికొచ్చిన వారి చేయి పట్టుకుని తీసుకెళ్ళి మరీ చూపించి బ్రహ్మానంద పడిపోతున్నాడు.

పిచ్చుక, గులాబి మొక్కలు–కిట్టూ నేస్తాలయ్యాయి. గింజలెయ్యటం, నీళ్ళుపోయడం వాడి దినచర్య అయిపోయింది.

పిచ్చుక కూడా కిట్టూని వదల్టం లేదు. రోజూ చొరవగా వస్తోంది. వాడి దగ్గర వాలుతుంది. పట్టుకో అంటూ కవ్విస్తుంది. నవ్విస్తుంది.

కిట్టూలో కొత్త ఉత్సాహం ఉత్తేజం వెల్లివిరియటం చూసి ముక్కున వేలేసుకున్నాం నేనూ, మా వారూ.

"దానికీ వీడికీ ఏదో జన్మలబంధం వున్నట్టుంది" అన్నారాయన వారి అనుబంధం చూసి.

పిచ్చుక పిల్లకి 'బుజ్జిగాడు' అని పేరు పెట్టాను. కిట్టూమాత్రం 'కిచ కిచ' అనే వ్యవహరిస్తున్నాడు.

మెల్లగా అది మా ఇంటి మెంబరై పోయింది.

ఎంతో చొరవగా ఇంట్లోకొస్తోంది. చనువుగా వ్యవహరిస్తోంది. ఏవో ధాన్యపు గింజలు వెయ్యటమే గాక చిన్న గిన్నెలో నీళ్ళు పోసి ప్రక్కన పెడుతున్నాం.

ఒక్కోసారి దానితోబాటు ఒకటో రెండో పిచ్చుకల్ని తీసుకొస్తుంటుంది. అవి నిలకడగా వుండేవికావు. దాంతో బుజ్జిగాడు వాటి మీద కోప్పడి పంపేసేవాడు.

రాన్రాను నాకు విసుగొచ్చింది. బుజ్జిగాడు బాల్కనీని కంగాళీ చేసేస్తాడేమోనని భయం. కిట్టూగాడు దాని ధ్యాసలో పడి పిట్టలూ, మొక్కలూ, పచ్చదనం, పువ్వులూ అంటూ పనికిరాని 'పిచ్చి'లో పడటమూ నచ్చలేదు.

టీవీలో మూడు నాలుగేళ్ళ పిల్లలు ఎంచక్కా డాన్సేస్తున్నారు. పాడుతున్నారు. రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. ఈ పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే ప్రతిక్షణాన్నీ ప్రయోజనాత్మకంగా మలచుకోవాలి.

"కిట్టూని ప్లే స్కూల్లో వేసేద్దామండీ" భాస్కర్తో అన్నాను.

"అప్పుడే ఎందుకులే"

"ఎదురింటి వారమ్మాయి వీడి తోటిదే. అప్పుడే ఏబీసీడీలూ, నెంబర్లూ చెబుతోంది తెలుసా"

"పరిసరాల గురించి తెలుసుకోవలసిన వయస్సులో క్లాసురూంలో బందిస్తానంటావేమిటి"

"వాడు గొప్పవాడవ్వాలంటే ఇప్పట్నుంచీ అన్ని రకాల శిక్షణలూ ఇప్పించాల్సిందే"

"చదువుకన్నా జ్ఞానం గొప్పది. డబ్బు కన్నా దయ, దానం గొప్పవి"

ఆయన వంక పిచ్చిగా చూసి మొఖం తిప్పేసుకున్నాను. రెండ్రోజుల దాకా మాట్లాడలేదు కూడా.

ఒకరోజున బుల్‌డోజర్ల రొద, మనుషుల గోల, కోతయంత్రాల కర్కశ ధ్వని విన్పించింది. హడలిపోతూ బాల్కనీలోకి పరుగెత్తాను.

మా ఇంటి ప్రక్కనున్న చెట్లని పెళ్ళగిస్తున్నారు. పెద్ద పెద్ద చెట్లు కూలుతున్నాయి. పక్షుల గూళ్ళు కూలిపోయాయి. చెట్లని ఆశ్రయించి వున్న పక్షులన్నీ అరుస్తూ కకావికలయ్యాయి.

ఆ బీభత్స దృశ్యం చూసి కిట్టూ ఏడుపందుకున్నాడు.

గబుక్కున వాడ్ని ఇంట్లోకి తీసుకుపోయి, బాల్కనీ వైపు తలుపులు మూసేశాను.

"అ..మ్మా...కిచ..." అంటూ బాల్కనీ వైపు చూపిస్తూ ఏడుస్తున్నాడు.

"అబ్బే. కిచకిచకేం కాదురా. ఇంకో గూడు వుంటుంది. కళ్ళల్లో పెట్టుకుని చూట్టానికి దానికీ అమ్మ వుంది కదరా కన్నా..." ఎన్నో చెప్పేను. ఎంత అర్థమైందో తెలీదు.

కాని ఆ రాత్రంతా ఉలికిపడుతూనే వున్నాడు!

లేస్తూనే బాల్కనీ లోకి వెళ్ళాలని చూశాడు కిట్టూ. తలుపులు తీయనందున సాధ్యం కాలేదు.

నా చీర పట్టుకులాగాడు. వారించాను. గోలచేశాడు. విసుక్కున్నాను. కోప్పడ్డాను.

ఏమనుకున్నాడో ఏమో తిన్నగా వెళ్ళి వాళ్ళ నాన్న ముందు బుంగ మూతి పెట్టుక్కూర్చున్నాడు.

"ఏమైంది నాన్నా"

"కిచ కిచ..." బాల్కనీ వైపు చూపిస్తూ అన్నాడు.

"బాల్కనీలోకి తీసుకెళ్ళొద్దు. తట్టుకోలేడు..." వంటింట్లోంచే అరిచాను.

"ఇవాళగాక పోతే రేపైనా తెలియాల్సిందేగా" అంటూ వాడ్నెత్తుకుని తీసుకెళ్ళారు.

మంత్రించినట్లు అడవి మాయమైంది. యంత్రాలు గోతులు తవ్వుతున్నాయి. అది చూసి భాస్కర్ సైతం డీలా పడ్డారు.

"కడుపు తరుక్కు పోతోంది..." అంటూ లోపలికి వచ్చేశారు.

"ఎన్ని చెట్లు, ఎన్ని పక్షులు, ఎంత చల్లగాలి...పిచ్చుక గూళ్ళు కూడా..." ఆగి కిట్టూ మొహంలోకి చూశాను.

దిగులుగా వున్నాయి వాడి కళ్ళు.

"ఇంక ఆ వూసెత్తొద్దు. బెంగ పెట్టుకుంటాడు" అన్నారాయన.

"బుజ్జిగాడు మరి రాడంటారా?"

"వచ్చే అవకాశం తక్కువ. ఎన్ని రకాల పక్షులుండేవీ. అవన్నీ నిరాశ్రయులై...ఎక్కడి కెళ్ళి పోయామో పాపం!" గాద్గదికమైందాయన స్వరం.

నాకూ దిగులుగానే వుంది. గుండెనెవరో ఉక్కుహస్తంతో నలుపుతున్నంత బాధ!

"నగరాలు విస్తరిస్తున్నాయి గాని మనసులు కుంచించుకుపోతున్నాయి" బాధగా అన్నారు భాస్కర్.

కిట్టూ బాల్కనీలోకి వెళ్ళటం లేదు. మొక్కలకి నీళ్ళు పోయటం లేదు.

ప్రక్కనే భారీ కట్టడం ఊపిరి పోసుకోంటోంది. దాని తాలూకూ దుమ్మూ ధూళీ వల్లనో, యంత్రాల వేడి పొగల వల్లనో ఏమో, మళ్ళీ గులాబీ మొక్క మరో పూవు పూయ లేదు. పచ్చగా ఎదగనూ లేదు.

ఒకనాటి పచ్చని ప్రదేశాన్ని కాంక్రీటు శ్లాబులు ఆక్రమించుకోవటం చూడలేక బాల్కనీలోకి వెళ్ళటం తగ్గించేశాం.

మా మనసుల్నిండా ఏదో వెలితి, మరేదో కోల్పోయిన భావన!

కార్లు, విమానాలు, రాకెట్లు – ఎన్నో రకాల బొమ్మలు ఎన్నెన్నో శబ్దాలతో చిత్ర విచిత్ర విన్యాసాలు చేసే వాటిని కొనుక్కొచ్చారు భాస్కర్.

కిట్టూ దృష్టిని వాటి మీదకి మళ్ళించాలని శతవిధాల ప్రయత్నించాం. ఊహు వాడిలో మార్పు లేదు. మునుపటి ఉత్సుకత ఉత్సాహం మచ్చుకైనా లేవు. నవ్వు మరచి పోయిన వాడిలా వున్నాడు. విలువైనదేదో పోగొట్టుకున్న వాళ్ళా వుంటున్నాడు. సరిగ్గా తిండి తినక చిక్కి సగమయ్యాడు.

ఏం చెయ్యాలో పాలు పోక, "ఎందుకైనా మంచిది ఓసారి డాక్టర్‌కి చూపిద్దామండీ" అన్నాను భయాలు కప్పిపుచ్చుకుంటూ.

"డాక్టర్ వల్ల లాభం లేదు. పరిసరాలు మారాలి. ఇంకో ఇల్లు చూసుకునెళ్ళిపోదాం..."

"అన్నిటికీ అనుకూలంగా వుందీ ఎపార్ట్‌మెంట్. మీ ఆఫీసుకీ దగ్గర్లో వుందాయె"

“అయినా తప్పదు. లేకపోతే వీడు వాటిని మర్చిపోలేడు...”

ఇంతలో మావగార్నుంచి ఫోన్ వచ్చింది. ఆయన పల్లెలో వుంటారు. ఆ కబురూ ఈ కబురూ అయ్యాక పిచ్చుక గురించీ, చెట్లస్థానే వెలుస్తోన్న ఆకాశహర్మ్యం గురించీ చెప్పేను.

“కిట్టూ రైతు మనవడమ్మా. వాడిలో ప్రవహిస్తున్న రక్తమే పక్షులకీ ప్రకృతికీ దగ్గర చేస్తుంది..”

“పనికరాని చిన్న పక్షి కోసం వీడు బెంగపెట్టుకుంటున్నాడు చూడండి”

“పిచ్చుకని అలా తీసి పారెయ్యకమ్మా. అవి పంటలకు, మనుషలకు హానిచేసే క్రిమి కీటకాల్ని తింటాయమ్మా. ఏడాది పొడవునా సంతానోత్పత్తి చేస్తూ మనిషితో బాటు మనుగడ సాగించే మూగజీవాలమ్మా... వాటిని బతకనివ్వకపోతే మొత్తం వాటి జాతే అంతరించిపోతుంది తల్లీ...!” ఆవేదనగా అన్నారు.

“ఎవరి బతుకులు వాళ్ళే బతక లేకపోతున్న రోజులు. ఇక పిట్టల్నీ పిచ్చుకల్నీ ఎవరు పట్టించుకుంటారు?”

“నా చిన్ని పొట్టకు శ్రీరామ రక్ష అనుకోకూడదు. ఎందరో గృహస్థు మీద ఆధారపడి బ్రతుకుతారు. సన్యాసులు బ్రహ్మచారులే కాదు పశుపక్ష్యాదులు కూడా. మనిషి బతకాలి. పది జీవుల్ని బతికించాలి. అదే గృహస్థు ధర్మం. అందుకే గృహస్థాశ్రమం ఉత్తమం అయింది. అప్పుడే జన్మ సార్థకమవుతుంది...”

“ఏమో మావయ్యా. నా బెంగంతా కిట్టూ గురించే.”

“వాడ్ని తీసుకుని ఓ సారిక్కడికి రండి. అన్నీ దారిలో పడిపోతాయి”

రోజు రోజుకీ చిక్కిపోతున్న కిట్టూని చూడలేక వారం రోజులు శలవు పెట్టి పల్లెకి వెళ్ళాం.

బస్సు దిగేమో లేదో మావయ్య గారెదురొచ్చి కిట్టూని భుజానికెత్తుకుని కబుర్లలో పడ్డారు.

ముందు సంకోచించినా ఆ వెంటనే కలిసి పోయాడు కిట్టూ.

తాతా మనవళ్ళు కబుర్లు చెప్పుకుంటూ ముందు నడుస్తున్నారు.

చెరువులోని తామరాకుల్ని తామర పూలని చూపారు. ఒక తామరవువ్వు కోసిచ్చే సరికి కిట్టూ మోము తామరాకంత అయింది.

పచ్చని చెట్లనీ పక్షుల్నీ ఇళ్ళనీ ఇంటి పెరళ్ళలోంచి తొంగి చూస్తోన్న పూల మొక్కల్నీ చూపిస్తూ వివరిస్తోంటే శ్రద్ధగా వింటున్నాడు. దారిపొడవునా ఎందరెందరో పలకరిస్తూ బుగ్గలు నిముర్తుంటే పొంగిపోతున్నాడు.

మా అత్తవారిది ఎత్తరుగుల పెంకుటిల్లు. అరుగు చాలా పెద్దది. యాభైమంది చక్కగా కూర్చోవచ్చు.

గుమ్మానికో ప్రక్కన చూరుకి వరి కంకుల గుత్తి వ్రేలాడుతోంది.

దాని మీద పడి పిచ్చుకలు గింజల్ని పొడుచుకు తింటున్నాయి. కల తిరుగుతున్నాయి. సంబరంతో చిందులేస్తున్నాయి. పండుగ చేసుకుంటున్నాయి.

ఆ దృశ్యం చూసి తాత గారి చేతుల్లోంచి జారి పోయాడు కిట్టూ.

సంబరంగా సమీపించి తప్పట్లు కొడుతూ చిందులెయ్య సాగాడు.

అంబరాన్నంటుతోన్న వాడి సంబరం చూసి మైమరచిపోయాను.

బాలకృష్ణుడి నోట్లో యశోదమ్మకి పద్నాలుగు లోకాలు కన్పించాయో లేదో తెలీదు గాని మా కిట్టూ మోములో ఆనందావిష్కరణ కన్పించింది. బ్రహ్మానందానికి తాత్పర్యం సాక్షాత్కరించింది. మనిషికీ ప్రకృతికీ మధ్య గల అనుబంధపు సూత్రమూ కనబడింది.

సత్యమూ నిత్యమూ అయిన భావనేదో అర్థమైంది. వరికంకుల గుత్తి నా పాలిట బోధివృక్షమయ్యింది!

* * *

**(ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక - జూన్ 2010)**